



టెక్కలి జిల్లా కేంద్రఆసుపత్రిలో స్కానింగ్ కోసం నిరీక్షిస్తున్న గర్భిణులు

సొంత లాభం ఎంతో చూసుకుని...

- జిల్లా కేంద్ర ఆసుపత్రిలో తగ్గిన ప్రసవాల సంఖ్య
- కొందరి వైద్యుల తీరుపై అనుమానాలు

6లో

ఎందుకో.. ఆ మౌనం?



- కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో సరుకుల పంపిణీకి ఖరారుకాని టెండర్లు
- గతేడాది కిలో కూరగాయలు రూపాయికే ఆమోదం
- ఈ ఏడాది మాత్రం రెండు నెలలుగా జాప్యం
- స్థానిక కాంట్రాక్టర్లకు లబ్ధి కల్పిస్తున్న అధికారులు

శ్రీకాకుళం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):

కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ), ఆదర్శ పాఠశాలల్లోని వసతిగృహాలకు కూరగాయలు, నిత్యావసర సరుకుల పంపిణీకి సంబంధించి టెండర్ల ఖరారు జాప్యమవుతోంది. గతేడాది ప్రత్యేక శ్రద్ధ చూపిన అధికారులు, ఈ ఏడాది మాత్రం టెండర్లు పిలిచి సుమారు రెండు నెలలు కావస్తున్నా, ఖరారు చేయకుండా మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోంది. ఉద్దేశపూర్వకంగానే కొంతమంది అధికారులు తాత్కాలికంగా సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో కొంతమంది అధికారులు కూడా సొంతలాభం చూసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● అప్పుడు అలా... ఇప్పుడు ఇలా..

జిల్లాలోని 25 కేజీబీవీ హాస్టళ్లు, 13 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 8వేల మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భోజనం కల్పించాలి. ఈ మేరకు అవసరమైన కూరగాయలు, నిత్యావసరాలు పంపిణీకి గతేడాది టెండర్లు పిలిచారు. ధరల్లో ప్రజలు నివ్వెరపోయేలా సుమారు 22 రకాల కూరగాయలను.. ఒక్కో కిలో రూపాయికి చొప్పున సరఫరా చేస్తామని ఓ వెండర్.. టెండర్ వేశారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి ఖరారు చేసేశారు. రూపాయికి కిలో కూరగాయలను నాణ్యమైనవి ఏవిధంగా సరఫరా చేస్తారన్న ఆలోచన కూడా లేకపోయింది అధికారులకు. దీనిపై విమర్శలు రావడంతో 2024-2025 విద్యా సంవత్సరం ముగిసే కొద్దిరోజుల ముందు ఆ వెండర్‌ను రద్దు చేశారు. టెండరుదారున్ని మార్చించారు.

● ఈ ఏడాది (2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి) ఏప్రిల్ 30న కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలకు నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ కోసం టెండర్లు ఆహ్వానించారు. మే 5 వరకు టెండర్లను స్వీకరించారు. జూన్ 12న ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకున్నాయి. వసతిగృహాల్లో కూడా విద్యార్థులు చేరిపోయారు. కానీ టెండర్లను స్వీకరించినా.. ఇంతవరకు ఖరారు కాలేదు. దీంతో స్థానికంగా కూరగాయలు, నిత్యావసరాలను (మిగతా 8వ పేజీలో..)

డీసీఎంఎస్‌కు ఇచ్చేందుకు ప్రణాళిక..

టెండర్ల ద్వారా నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేసే బందులు.. ప్రభుత్వ అనుబంధ రంగాలను బలోపేతం చేయాలని సర్కారు భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వీటి సరఫరా కాంట్రాక్ట్ బాధ్యతను డీసీఎంఎస్‌కు అప్పగించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఇలా జరిగితే కొంత పారదర్శకంగా ఉండే అవకాశముంది. కాగా ఇంతవరకు టెండర్లకు దరఖాస్తులను స్వీకరించి.. అధికారులు ఉద్దేశపూర్వకంగా మౌనం దాల్చడం.. హాస్టళ్లలో భోజనంలో పర్యవేక్షణ లేకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. సకాలంలో డీసీఎంఎస్‌కు లేదా టెండర్ల ద్వారా వ్యాపారులకు కట్టబెట్టి.. నిధులు గోల్‌మాల్ జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. దీనిపై జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా ప్రత్యేక దృష్టి సారించాలి.

గడువులోపు సమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీడిరైతు సంఘం నాయకులు

పలాస రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజలు సమస్యలపై ఇచ్చే వినతులను పరిశీలించి నిర్ణీత గడువులోగా వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. పలాస ట్రెజరీ కార్యాలయం ఆవరణలో కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్).. 'మీ కోసం' కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌స్థాయిలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించారు. జీడి పంటకు గిట్టుబాటు ధరపై ఇచ్చిన హామీని అమలు చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు టి.అజయ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో ఆస్తుల ఆక్రమణలు తొలగించి బాధితులకు న్యాయం చేయాలని టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్, బడ్డ నాగరాజు తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బ్రాహ్మణతర్లాలో సర్వేనెంబరు 56/1లోని కస్పావీధి, పెద్దవీధి, నడిమివీధి, చాకలివీధి, వూన వీధులు ప్రభుత్వం గ్రామకంఠంగా గుర్తించింది. దీంతో ఆస్తుల క్రయవిక్రయాలు జరగక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు పరిశీలించి వాటిని తొలగించాలని జిల్లా ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబరు వి.యాదగిరి, గ్రామస్థులు అల్ల కృష్ణారావు, వూన రత్నాకర్, సురేంద్ర వినతిపత్రం అందజేశారు. ఇలా చాలామంది పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. కలెక్టర్ హాజరుకానున్నారని తెలిసి ఉదయం నుంచీ తహసీల్దార్ కార్యాలయం వద్ద బారులుదీరారు. కలెక్టర్ మాట్లాడుతూ.. భూములు.. స్థలాల ఆక్రమణ, భూముల సరిహద్దుల మార్పు, మ్యూటేషన్స్, లబ్ధిదారుల పేర్లు మార్పు తదితర సమస్యలపై అధికంగా వినతులు వచ్చాయన్నారు. ఈ వినతులు సంబంధిత శాఖ అధికారులు సమగ్రంగా పరిశీలించి.. సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్, ఆర్డీవో జి.వెంకటేష్, తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, మునిసిపల్ కమిషనర్ రామారావుతోపాటు రెవెన్యూ, మునిసిపల్, సచివాలయం, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

2,500 ఎకరాలకు సాగునీరందేనా?

- పోర్టు రోడ్డు నిర్మాణంతో వంశధార కాలువలు కప్పేశారు
- ఆందోళనలో 20 గ్రామాల రైతులు



టెక్కలి సమీపంలో కాలువ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వంశధార, పోర్టు అధికారులు (ఫైల్)

టెక్కలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పోర్టు రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా రైతులకు సాగునీటి ముప్పు ఎదురవుతోంది. సంతబొమ్మాళి మండలం మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు కోసం నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మదన గోపాల సాగరం నుంచి మూలపేట వరకు 13.6 కిలోమీటర్లు.. వందమీటర్ల వెడల్పుతో విస్తరణ పనులు చేపడుతున్నారు. టెక్కలి, సంతబొమ్మాళి మండలాల్లోని 20 గ్రామాల్లో కాలువలు, చెరువులు కప్పేస్తున్నారు. వంశ ధార పరిధిలో 50ఏఆర్, 50ఆర్, 49ఆర్, 48ఆర్ కాలువల పైనుంచి రోడ్లు వేస్తున్నారు. దీంతో తమకు సాగునీటి ఇబ్బందులు ఎదుర య్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పోర్టు రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న మారిటైం బోర్డు సివిల్ ఇంజనీర్లు, విశ్వసముద్ర సంస్థ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా సుమారు 2,500 ఎకరాలకు సాగు నీరు అందుతుందో లేదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఈ ఏడాది జనవరి 9న వంశధార ప్రధాన ఎడమకాలువ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.శేఖరరావు, డీఈఈలు సుధాకర్, నవీన్, మారిటైం బోర్డు సివిల్ ఇంజనీర్లు, విశ్వసముద్ర ఇంజనీరింగ్ అధికా రులతో కలిసి పోర్టు రోడ్డును పరిశీలించారు. వంశధార అధికారులు ప్రస్తుతం ఉన్న 30 కాలువలతో పాటు అదనంగా మరో 20 (మిగతా 8వ పేజీలో..)



వైద్యఆరోగ్యశాఖ అధికారులను విచారణ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు

మరింత లోతుగా దర్యాప్తు

- సదరంలో నకిలీ ధ్రువపత్రాలు జారీపై పోలీసుల ఆరా
- వైద్యులపై చట్టపరమైన చర్యలకు సిద్ధం

నరసన్నపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నరసన్నపేట సామాజిక ఆస్పత్రిలోని సదరంలో సకలాంగులకు దివ్యాంగులుగా పత్రాలు జారీ చేసిన కేసుపై స్థానిక పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. గతంలో పనిచేసిన డీసీహెచ్ రాజ్యలక్ష్మి, ఆస్పత్రి సిబ్బందిని నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు సోమవారం విచారణ చేపట్టారు. అప్పట్లో నరసన్నపేట సామాజిక ఆసుపత్రిలో పొందూరు, ఆమదాలవలస, కోటబొమ్మాళి, నరసన్నపేట, జలుమూరు మండలాలకు చెందిన పలువురు సకలాంగులకు దివ్యాంగులుగా ధ్రువీకరణ పత్రాలు జారీచేశారు. ఆ పత్రాలు ద్వారా చాలా మంది పింఛన్లు, ఇతర సౌకర్యాలతో లబ్ధి (మిగతా 8వ పేజీలో..)

మ్యాపింగ్‌తో తారుమారు

- తల్లికి వందనం పథకానికి దూరమైన లబ్ధిదారులు



వెంకటరమణ, లక్ష్మీ, పిల్లలు

మెళియాపుట్టి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పొరపాట్లు కారణంగా తల్లికి వందనం పథకం అందక చాలామంది విద్యార్థుల తల్లులు ఆవేదన చెందుతున్నారు. గతంలో వలంటీర్ల ద్వారా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసిన విషయం తెలిసిందే. కాగా.. మ్యాపింగ్ సమయంలో సంబంధంలేని వ్యక్తులను కూడా కుటుంబాల్లో చేర్పించడంతో.. ప్రస్తుతం ప్రభుత్వ పథకాలకు దూరవమతున్నామని పలువురు వాపోతున్నారు. మెళియాపుట్టిలో రేఖాన వెంకటరమణ, లక్ష్మీ దంపతులు మట్టి కుండలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు. మెళియాపుట్టి జడ్పీ పాఠశాలలో దినేష్ 8వ తరగతి, దేవేంద్ర ఆరో తరగతి చదువుతున్నారు. ప్రభుత్వం ఇటీవల తల్లికి వందనం పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేసిన విషయం తెలిసిందే. కాగా, రేఖాన లక్ష్మికి మాత్రం (మిగతా 8వ పేజీలో..)

కాలువలు శుభ్రం చేసి..

సాగుకు సౌకర్యం కల్పించి

- యుద్ధ ప్రాతిపదికన పూడికల తొలగింపు
- వంశధార కాలువలకు మహర్దశ

6లో

కాలువలు శుభ్రం చేసి సాగుకు సౌకర్యం కల్పించి..

● యుద్ధ ప్రాతిపదికన పూడికల తొలగింపు ● పలాస నియోజకవర్గంలో వంశధార కాలువలకు మహర్దశ

పలాస నియోజకవర్గం పరిధిలో వంశధార ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందించేందుకు ఎమ్మెల్యే శిరీష చర్యలు చేపట్టారు. దశాబ్దాల తరబడి నిర్లక్ష్యానికి గురైన కాలువలకు మహర్దశ పట్టింది.శుభ్రంచేయించి అన్నదాతలకు సాఫీగా సాగు నీటి సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టారు. ఇక్కడి వంశధార కాలువల్లో యుద్ధప్రాతిపదికన పూడికలను తొలగిస్తున్నారు.

పలాస,జూన్30(ఆంధ్రజ్యోతి):ప్రతి చేనుకు నీరు- ప్రతి చేతికి పని అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చుతోంది. గెలుపొందిన వెంటనే వంశధార నీరు వజ్రపుకొత్తూరు మండలంలోని శివారు ప్రాంతానికి అందించిన విషయం విదితమే. ఏడాది పాలనలో సాగు నీటికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. పలాస నియోజకవర్గంలో వంశధార కాలువ 17 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. నందిగాం మండలం నుంచి ప్రవేశించే కాలువలో అడుగడుగునా పిచ్చి మొక్కలు పేరుకుపోయాయి. వజ్రపుకొత్తూరు మండలం వరకు ఐదువేల ఎకరాలకుపైగా సాగునీరందించాల్సిఉంది.కాలువకు 25 ఏళ్లుగా మరమ్మతులు లేకపోవడం, పూడుకుపోవడంతో ఖరీఫ్‌లో సైతం సాగుకు నీరందడంలేదు. దీంతో పాటు దేశబట్టి కాలువ, దొంగగెడ్డ చానెల్ పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో వర్షం నీరు సైతం ముందుకువెళ్లని పరిస్థితినెలకొంది. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే గౌతుశిరీష ఆదేశాలమేరకు వంశధార, చిన్ననీటిపారుదలశాఖ అధికారులు సమన్వయంతో నియోజకవర్గంలోని ప్రధాన కాలువాలన్నీ శుభ్రం చేస్తున్నారు. ప్రస్తుతం కాలువల లైనింగ్, బట్టీలు శుభ్రం చేయడం, పిచ్చిమొక్కల తొలగింపు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

కాలువల అభివృద్ధికి ప్రాధాన్యం



ప్రతి చేనుకునీరందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార నీరు శివారు ప్రాంతాలకు అందించాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వంశధారనీరు విడుదలైతే ముందుగా పలాస నియోజకవర్గానికి వస్తుంది. అందుకు తగిన విధంగా కాలువలో పిచ్చిమొక్కలు లేకుండా సుందరీకరిస్తు న్నాం. దీంతోపాటు పిల్లకాలువల్లో కూడా పూడికలు తీయడానికి ఆదేశాలు ఇవ్వడంతో ఆ పనులు శరవేగంతో జరుగుతున్నాయి. రైతుబాగుంటేనే దేశం బాగుంటుంది. ఈ నినాదంతోనే సాగు నీటి కాలువలు, చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నాం.

-గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస



పలాస వద్ద దొంగగెడ్డలో పూడికలు తొలగించిన దృశ్యం

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కంచిలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సోమవారం రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలాన్ని జీఆర్‌పీ ఎస్‌ఐ షరీఫ్ సందర్శించారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. ఆయన వయసు 60 ఏళ్లు ఉంటాయని, గళ్ల చొక్కా, నల్లరంగు ప్యాంటు ధరించి ఉన్నట్టు చెప్పారు. వివరాలు తెలిసిన వారు పలాస జీఆర్‌పీ పోలీసులను సంప్రదించాలని కోరారు.

విధులకు ఆటంకం కల్పించడంపై ఫిర్యాదు

టెక్కలి, జూన్30(ఆంధ్రజ్యోతి): వంశధార పరిధిలో 49ఏఆర్ చేరివీధి నుంచి గోపినాథపురం చెరువుకు వెళ్లే కాలువఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన తనపై ఇన్‌ఫెంట్ జోసఫ్‌స్కూల్ యాజమాన్య ప్రతినిధులు విధులకు ఆటంకం కలిగించారని సోమవారం వంశధార ఈఈ బి.శేఖరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే కాలువకు సంబంధించి పది అడుగుల స్థలాన్ని పాఠశాల యాజమాన్యం ఆక్రమించుకుందని, వాటిని తొలగించాలని వెళ్తే అడ్డుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లాస్థాయి సర్వేయర్ ద్వారా దర్యాప్తు చేయాల్సి ఉందని, ప్రస్తుతం 49ఆర్ ఆక్రమణలు తొలగిస్తే తప్ప కాలువ వెంబడి రైతులకు సాగునీరు వెళ్లే పరిస్థితి లేదని తెలిపారు.

పొందూరులో అగ్నిప్రమాదం

పొందూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పొందూరు అఫీషియల్ కాలనీలో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో జె.రామప్రసాద్ ఇంటిలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలుచెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.లక్ష వరకు నష్టం ఉంటుందని అంచనావేశారు.

ఆవుల అక్రమ రవాణాపై కేసు నమోదు

సరుబుజ్జిలి,జూన్ 30(ఆంధ్రజ్యోతి):సరుబుజ్జిలి జంక్షన్ ప్రధాన రహదారిలో ఆవులను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదుచేసినట్టు ఎస్‌ఐ బి.హైమావతి తెలిపారు. ఆదివారం రాత్రి సరుబుజ్జిలి నాలుగు రోడ్ల కూడలిలో వాహనాలు తనఖీ చేస్తుండగా.. బీజేపీ మండలాధ్యక్షుడు వేల్పుల గోవిందరావు, భజరంగ్‌దళ్‌కార్యకర్తల సమాచారం మేరకు వాహనంలో గోవులు తరలిస్తుండడాన్ని గుర్తించామనిచెప్పారు.వాహనంలోఉన్న కొండంగికృష్ణ, పుచ్చ లక్ష్మణరావు, ఓనుము వెంకటతిరుపతిలను విచారించగా రుగడ నుంచి విజయనగరం జిల్లా అలమండకు తరలిస్తున్నట్టు చెప్పారని పేర్కొన్నారు. దీంతో ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి వాహనం సీజ్ చేసినట్టు తెలిపారు.

కొబ్బరి బొండాల వ్యాన్ బోల్తా

హరిపురం, జూన్30(ఆంధ్రజ్యోతి):మందస మండలంలోని కొర్రాయిగేటు సమీపంలో జాతీయరహదారిపై కొబ్బరిబొండాల లోడుతో కాకినాడ నుంచి ఇచ్ఛాపురం వైపువెళ్తున్న వ్యాన్ సోమవారం డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. దీంతోరోడ్డుపై బొండాలు పడిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మందస పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని హైవే సిబ్బందితో కలిసి బొండాలను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్‌చేశారు. డ్రైవర్ కుమార్ గాయపడడంతో హరిపురం ఆసుపత్రికి తరలించారు.

అనుమానిత వ్యక్తుల సమాచారం ఇవ్వండి

పోలాకి, జూన్ 30(ఆంధ్రజ్యోతి):సాగరతీరంలో అనుమానిత వ్యక్తుల తారసపడితే సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. సోమవారం గుప్పెడుపేటలో పోలాకి పోలీసులు సంకల్ప్‌పేరుతో మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో మత్స్యకారులకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, వేట నిషేధ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తొలుత వనవిష్ణుపురంలో శాంతి కమిటీ సమావేశం అడిషనల్ డీఎస్పీ శ్రీనివాసరావు, నరసన్నపేట సీఐ, పోలాకి ఎస్‌ఐ ఆధ్వర్యంలో జరిగింది. వనవిష్ణుపురంలో కొట్లాట వల్ల ఓ వ్యక్తి మృతిచెందడంతో పోలీసులు పికెట్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, వీఆర్వో ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ రంజిత్‌కుమార్, డి.ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌నగర్ అభివృద్ధికి చర్యలు చేపట్టండి

టెక్కలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి):టెక్కలి పంచాయతీలోని శ్రీనివాస్‌నగర్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని స్థానిక అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు సోమవారం టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు.శ్రీనివాస్‌నగర్‌లో కమ్యూనిటీహాల్ నిర్మించాలని,కాలువలు, పైపులైన్లు, సీసీరోడ్లు ఏర్పాటుచేయాలని డీపీ స్టాలిన్, చిట్టిన్న, వీరస్వామిరెడ్డి, విజయ్‌కుమార్, రమేష్, వెంకటరమణ తదితరులు కోరారు. రావివలసకు చెందిన బుసకల సూర్యనారాయణ ఆక్రమణలు పరిశీలించి న్యాయంచేయాలని అర్జీని అందజేశారు.

తిమడాంలో పశువైద్యశిబిరం

జలుమూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సురవరం పశువైద్యశాల వైద్యాధికారి విక్టరీ ఫ్రెడరిక్ తెలిపారు. తిమడాంలో పశువైద్య శిబిరం నిర్వహించారు.

●హరిపురం,జూన్ 30 (ఆంధ్రజ్యోతి):మందస మండలంలోని లోహరిబందలో మేకలు, గొర్రెలకు సామూహిక నట్టల నివారణ మందులను అందజేశారు.కార్యక్రమంలో వైద్యుడు దువ్వాడ శ్రీకాంత్, కిల్ల ఉమాభారతి, సిబ్బంది బాలకృష్ణ, మురళి, పార్వతి పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే పల్లె నిద్ర

హిరమండలం, జూన్30 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో సమస్యలు తెలుసుకునేందుకు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ ఎండీ యాసిన్ చెప్పారు. సోమవారం రాత్రి మండలంలోని తొర్లంగిలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్థుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. శాంతి భద్రతలకు విఘతం కలిగించకుండా ఉండాలని, ఎటువంటి సంఘటనలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెళియాపుట్టి,జూన్30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమడి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్‌కాలేజీలో మిగిలిఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఈఎల్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పదోతరగతిలో ఈఏడాది మార్చి, మే నెలల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనికోరారు.

సేవలే గుర్తింపునిస్తాయి


నరసన్నపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు చేసిన సేవలు గుర్తింపునిస్తాయని ఎంఈవోలు ఉప్పాడశాంతారావు, పి.దాలినాయుడులు తెలిపారు. సోమవారం స్థానిక బోర్డు ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్ లుకలాపు రత్నప్రభ పదవీవిరమణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ పదవీవిరమణ అనేది సాధారణమని, రత్నప్రభ విధినిర్వహణలో చేసినసేవలు చిరకాలం గుర్తుంటాయని తెలిపారు. అనంతరం రత్నప్రభ, మొయ్యి లక్ష్మునాయుడు దంపతులకు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, విద్యాకమిటీ చైర్మన్ రామకృష్ణ పాల్గొన్నారు.



రత్నప్రభ, లక్ష్మునాయుడును సన్మానిస్తున్న ఎంఈవోలు,ఉపాధ్యాయులు

చిప్స్ పోసి.. క్రషర్ వేసి..

● అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు ● ఇదీ సున్నాదేవి రహదారి దుస్థితి



అర్ధాంతరంగా నిలిచిపోయిన సుమ్మాదేవి రోడ్డు

పలాస రూరల్,జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నాదేవి గ్రామానికి వెళ్లే ప్రధానరహదారి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. హైవే లెవల్ క్రాసింగ్ నుంచి చిన్నసుమ్మాదేవి వరకూ ఆరుకిలోమీటర్లు వరకు ఉపాధిహామీ పథకం నిధులతో వైసీపీప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు ముందుకుసాగలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిప్స్, క్రషర్‌వేసి రోడ్డు పనులు ప్రారంభించారు. అయితే నేటికీ చిప్స్ వేసినా తారువేసిపనులు పూర్తిచేయకపోవడంతో ఈమార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకులు పల్టీలు కొట్టి గాయపడుతున్నారు. ప్రధానంగా బిల్లులుకాకపోవడంతో పనులు ముందుకుసాగలేదు. ఈరోడ్డు పనులు ఇప్పటి వరకూ పూర్తి చేయకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు క్రషర్ కొట్టుకుపోవడంతో రోడ్డుపై కేవలంచిప్స్ మాత్రమే కనబడుతోంది.ఈ మార్గంలో పలాస మండలంలోని పలు గ్రామాలకు ప్రధాన మార్గంకావడంతో నిత్యం రద్దీగాఉంటోంది. ఈ నేపథ్యంలో రోడ్డు పనులు నిలిచిపోవడంతో రాళ్లు తేలడం వల్ల వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రధానరహదారిని పూర్తిచేసి అవస్థలు తీర్చాలని పలువురు కోరుతున్నారు. కాగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సున్నాదేవి రోడ్డుకు సంబంధించి బిల్లులుకాకపోవడంతో పనులు నిలిచిపోయాయని ఏపీవో శంకరరెడ్డి తెలిపారు.

హొన్నాళి పాఠశాల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హరిపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని హొన్నాళి పాఠశాలను సోమవారం డీఈవో డాక్టర్‌తిరుమల చైతన్య పరిశీలించారు. పాఠశాల ఎదుట 6,7 తరగతులు కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టడంతో పాఠశాల కొనసాగించాలి..తల్లిదండ్రుల ఆందోళన శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈనెల 20న కథనం ప్రచురితమయ్యింది. దీంతో డీఈవో పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగితెలుసుకున్నారు.ఈసందర్భంగా ఐదుకిలోమీటర్ల దూరంలోని పీఎస్‌పురం హైస్కూల్‌కు తమ పిల్లలు వెళ్లేందుకు మధ్యలో మహేంద్రతనయానది ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. పాఠశాలలో తరగతులు కొనసాగిస్తే వలంటీర్లను తామే నియమించి బోధన కొనసాగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.వీరితోపాటు యూటీఎఫ్‌నాయకులు కిషోర్‌కుమార్, లండ బాబూరావు, గున్న రమేష్, జగదీష్ బడిత్య, సార భాస్కరరావు డీఈవోకు పాఠశాలలను తెరిపించి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.



హొన్నాళి పాఠశాల వద్ద డీఈవోను కలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు

సొంత లాభం ఎంతో చూసుకుని..

● జిల్లా కేంద్ర ఆసుపత్రిలో తగ్గిన ప్రసవాల సంఖ్య
● ప్రైవేట్ క్లినిక్‌లకు వెళుతున్న గర్భిణులు
● కొందరు వైద్యుల తీరుపై అనుమానాలు

టెక్కలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలని ఓ వైపు ఉన్నతాధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటోంది. ఒకప్పుడు వంద పడకల ఏరియా ఆసుపత్రిగా ఉన్నప్పుడు నెలకు 120కు పైగా ప్రసవాలు జరిగాయి. నేడు ఆసుపత్రి స్థాయి పెంచి... సౌకర్యాలు కల్పించి.. 200 పడకల స్థాయికి పెరిగిన తరువాత ప్రసవాల సంఖ్య నెలకు 90 లోపలికి పడిపోయింది... ఇదీ టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సేవల దుస్థితి. గతంలో ఇదే ఆసుపత్రిలో గైనకాలజీ వైద్యులు తక్కువగా ఉన్నా... ప్రసవాల సంఖ్య మాత్రం వంద దాటేఉండేది. నేడు గైనకాలజీ వైద్యులు నలుగురు ఉన్నప్పటికీ జిల్లా కేంద్ర ఆసుపత్రితో పాటు సమాంతరంగా ప్రైవేట్ క్లినిక్‌లు నడుపుతుండడం విశేషం. ఆసుపత్రికి వచ్చే గర్భిణులను గుర్తించి... ముందుగాకొందరు దళారుల ద్వారా వారితో మాట్లాడి... ప్రైవేటు క్లినిక్‌లకు ప్రసవాలకు వెళ్లేలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్ర ఆసు పత్రిలో నెలకు సుమారు 400 వరకు గర్భిణులకు స్కానింగ్, ఇతర పరీక్షలు జరుగుతు న్నా ప్రసవాలకు వచ్చేసరికి 90 లోపలే ఉండడం ఇక్కడ కొందరు గైనకాలజీ వైద్యుల 'పనితీరు'కునిదర్శనంగానిలుస్తోంది. ఏప్రిల్ నెలలో మొత్తంగా 76 ప్రసవాలు జరిగాయి. మే నెలలో 63, జూన్‌లో 88 ప్రసవాలు జరిగాయి. ఇక్కడ ప్రసవాలు చేయడం కష్టమంటూ ఏప్రిల్‌లో ఏడు, మేనెలలో ఎనిమిది, జూన్‌నెలలో 12 రిఫర్ చేసినట్టు జిల్లా కేంద్ర ఆసుపత్రి రికార్డులు చెబుతున్నాయి. ఇక్కడ ఆసుపత్రిలో స్కానింగ్ చేయించుకు న్న గర్భిణులే స్థానిక ప్రైవేటు క్లినిక్‌లలో ప్రసవాలు చేయించుకుంటున్నారంటే.. ఆసుప త్రిలో పనిచేస్తున్న గైనకాలజీ వైద్యుల పరిస్థితి అర్థమవుతుంది. జిల్లా కేంద్ర ఆసుపత్రి లో ప్రసవాలసంఖ్య పెరిగేలా యంత్రాంగం దృష్టిసారించాల్సిన అవసరంఎంతైనా ఉంది. ఈ ఆసుపత్రిలో పనిచేస్తున్న గైనకాలజీ వైద్యులు ప్రైవేట్ క్లినిక్‌లు నడపడం వలనే ప్రసవాల సంఖ్య తగ్గుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావు వద్ద ప్రస్తావించగా... ప్రభుత్వ గైనకాలజీ వైద్యులు ప్రైవేట్ క్లినిక్‌లు నడపడం వల్ల ప్రసవాల సంఖ్య తగ్గి ఉండవచ్చునని భావిస్తున్నానని అన్నారు. ఇప్పటికే రిఫరల్ కేసులు సంఖ్య తగ్గించామని... ప్రసూతి విభాగంలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.



టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో బాలింతలు

సాగు చేస్తున్నాం.. న్యాయం చేయండి

పలాస, జూన్ 30(ఆంధ్రజ్యోతి):1979 సంవత్సరం నుంచి సర్వేనెంబరు 198/1లో ఉన్న 62 సెంట్లు భూమిని సాగుచేసుకుంటున్నామని, ఇది తమ భూమని కొందరు దౌర్జన్యం చేస్తూ ఆటంకం కల్పిస్తున్నారని బాధిత రైతులు త్రిలోచన పాత్రో, ప్రభావతి పాత్రో వాపోయారు.ఈమేరకు పలాసలో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో రైతులతో కలిసి వివాదానికి కారణమైన భూమిని పరిశీలించారు. ఈసందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఉదయపురం రెవెన్యూ పరిధిలో ఉన్న62 సెంట్లు 1978లో లండ దండాసి నుంచి కొనుగోలుచేశామని, ప్రస్తుతం తమ ఆధీనంలోఉన్నట్లు పొజిషన్‌సర్టిఫికెట్ కూడా ఉందని తెలిపారు. తప్పుడు రిజిస్ట్రేషన్, డ్యాకు మెంట్లుపట్టుకొని తమపై ఓ కుటుంబందౌర్జన్యానికి దిగుతోందని వాపోయారు. రెవెన్యూ అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. బాధిత రైతులకు మద్దతుగా టీడీపీ, వైసీపీ నాయకులు బలరామ్‌బెహరా, టి.హరినాథ్, కృష్ణనాయక్, లోకనాధబెహరా, బుట్టురాజులు, ఐ.మల్లేశ్వరరావు కలెక్టర్‌ను కలిశారు.



రైతులు అందజేసిన అర్జీని పరిశీలిస్తున్న స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్

సంక్షేమ కార్యక్రమాలను వివరించాలి

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపు

నరసన్నపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, రాబోయే నాలుగు సంవత్సరాల్లో చేపట్టనున్న విధానాలను ప్రజలకు ముందుకు వెళ్లి వివరించాలని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం నరసన్నపేట టీడీపీ కార్యాలయంలో సుపరిపాలనలో తొలి అడుగు శిక్షణ తరగతులను నరసన్నపేట, పోలాకి మండలాల నాయకులకు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, శిమ్మ చంద్రశేఖర్, జల్లు చంద్రమౌళి, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, ఉణ్న వెంకటేశ్వరరావు, జామి వెంకట్రావు, గొలివి రామారావు, నాయకులు ఎంవీ నాయుడు, కె.రమేష్, బైరి భాస్కరరావు పాల్గొన్నారు.

●పోలాకి,జూన్ 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొల్లివలసకు చెందిన టీడీపీ నాయకుడు సాధురాములు మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దిగ్భాంతి వ్యక్తంచేశారు.జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బగ్గుసుగుణ కుటుంబసభ్యులను పరామర్శించారు.అంత్యక్రియల్లో రమణమూరిపాల్గొన్నారు. కార్యక్రమంలో మెండప్రవీణ్‌పద్మావతి, ఎంవి.నాయుడు కిల్లివేణు పాల్గొన్నారు.



నరసన్నపేట: మాట్లాడుతున్న రమణమూర్తి

పీజీఆర్‌ఎస్‌కు హాజరుకాని సిబ్బందికి నోటీసులు

టెక్కలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): టెక్కలి సబ్‌కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌కు అధికారులు హాజరుకాకపోవడంతో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి షోకాజ్‌నోటీసులు జారీచేశారు. డివిజినల్ కోపరేటివ్ అధికారి, పంచాయతీరాజ్ డీఈఈ, సహాయ కార్మికశాఖ అధికారి, సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారి, వెలుగు ఏపీడీ, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు, ఉపవిద్యాశాఖాధికారి పూర్తిగా హాజరుకాలేదు. ఉపవైద్యాధికారి, వంశధార, సహాయ గిరిజన సంక్షేమాధికారి, సీడీపీవో, ట్రాన్స్‌కో, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి, ఆర్‌అండ్‌బీ, మత్స్యశాఖ, డుమా, వ్యవసాయశాఖ, మెడికల్ సూపరింటెండెంట్‌కు సంబంధించి కిందిస్థాయి ఉద్యోగులు మాత్రమే హాజరయ్యారు. దీంతో ఆర్డీవో స్పందించి గైర్హాజరైన డివిజన్ స్థాయి అధికారులు, కొన్నిశాఖలకు సంబంధించి కిందిస్థాయి సిబ్బంది హాజరు కావడంపై నోటీసులు జారీచేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్ఠాత్మకంగా ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం చేపడుతున్నా, టెక్కలి డివిజన్‌లో పలు శాఖల అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలొస్తున్నాయి. కొన్నిశాఖల అధికారులు గైర్హాజరుకావడం, మరికొన్ని శాఖలు కిందిస్థాయి అధికారులను పంపించి మమ అనిపిస్తున్నాయి. సబ్‌కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్‌ఎస్‌కు పూర్తిస్థాయి అధికారులు ఏనాడూ హాజరుకాని పరిస్థితి నెలకొంది. రెండు నెలల కిందట ఆర్డీవో ఈ పరిస్థితిని చూసి పలువురికి మెమోలు జారీచేసిన విషయం విదితమే.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం, జూన్30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిడ్డిమి, సవర తిడ్డిమి, చిన్నపద్మాపురంలో మంగళవారం ఉదయం ఎనిమిది మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి డివిజన్ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శంకరరావు తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ ప్రాజెక్ట్ పనులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాలపరిధిలోగల వినియోగదారులు సహకరించాలని పాతపట్నం డీఈఈ ప్రసాదరావు కోరారు.

●సంతబొమ్మాళి, జూన్30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరుభద్ర సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఆరుగంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సబ్‌స్టేషన్‌కు సరఫరా అయ్యే 33 కేవీ లైన్ పాడవడంతో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 12గంటల వరకుసరఫరా నిలిచిపోయింది.విద్యుత్‌సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు.

లోకేశ్‌ను కలిసిన ఎంజీఆర్

పాతపట్నం, జూన్30 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో విద్యా,ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌ను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంజీఆర్ నియోజకవర్గ సమస్యలు వివరించారు.వచ్చేనెలలో అభివృ ద్ధిపనుల శంకుస్థాపనకు లోకేశ్ వస్తారని తెలిపారు.



లోకేశ్‌తో మామిడి గోవిందరావు

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సంతబొమ్మాళి,జూన్30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలుగువానిపేట మత్స్యకారుడు గొర్లె రామారావు కుటుంబానికి పది లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని జిల్లా మత్స్యకార సంఘ నాయకుడు చీకటి శ్రీరాములు కోరారు. సముద్రంలో బోటు బోల్తా పడి మృతిచెందిన రామారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శ్రీముఖలింగేశ్వరాలయం ఇన్‌చార్జి ఈవోగా వాసుదేవరావు

జలుమూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరాలయ ఇన్‌చార్జి ఈవోగా టి.వాసుదేవరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈవోగా పనిచేసిన పి.ప్రభాకరరావు పదవీవిరమణ చేశారు. దీంతో ఆయన స్థానంలో పాతపట్నం అమ్మతల్లి ఆలయ ఈవోగా పనిచేస్తున్న టి.వాసుదేవరావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయశాఖ అధికారులు ఆదేశాలు జారీచేసారు.

సరైన ఓటర్ల జాబితా సిద్ధంచేయాలి

టెక్కలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులు సరిదిద్ది సరైన ఓటర్ల జాబితా సిద్ధంచేయాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో వివిధరాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కుటుంబసభ్యులందరి ఓట్లు ఒకేపోలింగ్‌బూత్‌లో ఉండేలా బీఎల్వోలు దృష్టిసారించాలన్నారు. పోలింగ్‌బూత్‌ల్లో మౌలిక సదుపాయాలకల్పన, చనిపోయిన ఓటర్లను తొలగించడం, డబుల్‌ఎంట్రీలు తొలగించడంపై బీఎల్వోలు దృష్టి సారించాలని తెలిపారు. సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షులు బగాది శేషగిరిరావు, కాంగ్రెస్, జనసేన, బీజేపీ, బీఎస్పీ నాయకులు టీబీజీ గుప్త, అనపాన జనార్దనరెడ్డి, రామ్‌జీ, రాజకుమార్‌రెడ్డి, బోకర నారాయణరావు, సోమేసు, రాజారావు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు సహకరించాలి: సీఈవో

నరసన్నపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని, ఇంట్లో తడి, పొడి చెత్త వేరు చేయాలని జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా కోరారు. సోమవారం మడపాంలో తడి, పొడిచెత్త వేరుచేసిన విధానం- పరిసరాలు పరిశుభ్రతపై కరపత్రాలు పంపిణీచేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో రేణుక, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐక్యతతోనే మత్స్యకారుల అభివృద్ధి

పాత శ్రీకాకుళం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఐక్యతతోనే మత్స్యకారులంతా అభివృద్ధి సాధించగలరని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అర్జున్ అన్నారు. సోమవారం స్థానిక ఎన్జీవో హోంలో ఉమ్మడి జిల్లా సంప్రదాయ మత్స్యకార కులాల సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులంతా ఐక్యంగా ఉండాలని, సమష్టిగా పోరాడితేనే ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో పొందవచ్చునన్నారు. సమావేశంలో వాడబలిజ, పల్లె, బెస్త, నెయ్యల, అగ్నికుల క్షత్రియ, జాలారి తదితర 14 మత్స్యకార ఉపకులాలు చెందిన నాయకులు పాల్గొన్నారు. మత్స్యకార వృత్తికి అవసరమైన వలలు, మోటర్లు, తెప్పలు, ఐస్ బాక్సులు ప్రభుత్వం అందించాలని కోరారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు, ప్రతినిధులు టి.సూర్యనారాయణ ఎస్టీ సాధన సమితి సభ్యులు నెయ్యిల పాండురంగ మురళీకృష్ణ, జిల్లా అధ్యక్షుడు దువ్వాడ గురునాథ్, చీకటి శ్రీరాములు, సాయి బలరాం, రమణ, చోడిపల్లి దేముడు, మైలపల్లి సింహాచలం, బర్రి చిన్నప్పన్న, శ్రీను బాబు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

అరసవల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో ఆయా సంఘాల ఉమ్మడి సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రరావు, కె.మోహనరావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు మాట్లాడుతూ.. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ల్యాబర్ కోడ్స్ రద్దు చేయడంతోపాటు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఇండో అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను తిరస్కరించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా 200 పనిదినాలు కల్పించాలని, రోజువారీ వేతనం రూ.600 పెంచాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ లైట్లు ఎప్పుడు వేయిస్తారు?

ఇచ్ఛాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం బృందావన్ కాలనీలో విద్యుత్ స్తంభాలు వేసి ఏడాది పూర్తయినా ఇంత వరకు లైట్లు వేయకపోవడం దురదృష్టకరమని, దీంతో ఆ స్తంభాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయని ఒకటవ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్ సంబంధిత అధికారులను నిలదీశారు. సోమవారం ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన మునిసిపల్ సాధారణ సామావేశం జరిగింది. అజెండాలో పొందిపరిచిన 11 అంశాలపై చర్చించాగా.. అందులో ఐదు అంశాలు అభ్యంతకరంగా ఉన్నాయని తెలుపుతూ వైస్ ఛైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి డీసెంట్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు తమ పరిధిలో నెలకొన్న పలు సమస్యలు సభలో ప్రస్తావించారు. కమిషనర్ ఎన్.రమేష్, వైస్ ఛైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, కౌన్సిలర్లు ఆశి లీలారాణి, పి.మధుమూర్తి, ప్రదీప్ అధికారులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ పూర్తి

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు సోమవారం బదిలీల కౌన్సెలింగ్ స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో జరిగింది. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు పర్యవేక్షణలో నిబంధనల మేరకు ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐదేళ్లు పూర్తిచేసిన ఉద్యోగులకు బదిలీ అవకాశం కల్పించగా, తొలుత విభిన్న ప్రతిభావంతులు, స్పౌజ్ కేటగిరీకి చెందిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అభ్యర్థులు ఇప్పటికే ఎంచుకున్న ఆప్షన్లు, ఖాళీల ఆధారంగా, సీనియార్టీ ప్రాతిపదికన ఎంపికలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఐదేళ్ల సర్వీసు దాటిన 340 మందికి, అలాగే ఇతరులు 60 మందికి బదిలీల కౌన్సెలింగ్ చేపట్టినట్లు డీడీ తెలిపారు.

ఆటోల ఫిట్‌నెస్‌కు శ్రీకాకుళం వెళ్లలేం

ఇచ్ఛాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆటోలు ఫిట్‌నెస్ కోసం 130 కి.మీ. దూరంలో ఉన్న శ్రీకాకుళం వెళ్లే కంటే ఇచ్ఛాపురంలోనే చేయించుకునే అవకాశం కల్పించాలని నియోజకవర్గ ఆటో యూనియన్ సంఘ ప్రతినిధులు సోమవారం ప్రకటనలో కోరారు. ఈ నెల 2వ తేదీ బుధవారం 400ఆటోలతో భారీ నిరసన ర్యాలీ చేపట్టనున్నట్టు తెలిపారు. తులసమ్మగుడి నుంచి ఇచ్ఛాపురం మెయిన్‌రోడ్ మీదుగా అమీన్‌సాహెబ్‌పేట గుండా హైవే వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి హరి, గౌరవ అధ్యక్షుడు ఉలాసి ఎర్రయ్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



రామ్మోహన్‌రావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

గార, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగికి చేసిన సేవలే గుర్తింపును ఇస్తాయని పలువురు వక్తలు అన్నారు. గార ఎంపీడీవోగా విధులు నిర్వహించి సోమవారం పదవీ విరమణ చేసిన ఎస్.రామ్మోహనరావు అభినందన సభ స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. తనకు విధి నిర్వహణలో సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు తెలిపారు. అనంతరం రామ్మోహన్‌రావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉపాధ్యాయునికి సన్మానం



ఉమామహేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

గార, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆడవరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బోగెల ఉమామహేశ్వరరావు సోమవారం పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్థులు ఉమామహేశ్వరరావు, స్వాతి దంపతులను ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీడీపీ నాయకులు గుజ్జల హిమగిరి మాట్లాడుతూ.. హెచ్‌ఎంగా పాఠశాల రూపురేఖలను మార్చేసి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. డీఈవో కార్యాలయ రిటైర్డు సూపరింటెండెంట్ ఐఎన్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ.. ఉమామహేశ్వరరావు ఉపాధ్యాయ వృత్తులనే కాకుండా, కవిగా, నటుడిగా రాణించారన్నారు. వైద్య ఆరోగ్యశాఖ గణంకాధికారి పక్కి శ్రీనివాసరావు, విద్యా కమిటీ ఛైర్మన్ ఉర్లాపు రామారావు, మాజీ ఛైర్మన్ గంగాధర్, టీడీపీ నాయకులు అదేవిధంగా గార ఎంఈవో నక్క రామకృష్ణ, ఎంఈవో-2 వినోదిని ఫోన్‌లో అభినందనలు తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా రఘు

గార జూన్ 30(ఆంధ్రజ్యోతి): గార ఎంపీడీవో రామోహ్మన్‌రావు సోమవారం పదవీ విరమణ చేయడంతో ఇదే కార్యాలయం పరిపాలన అధికారి (ఏవో) పనిచేస్తున్న ఐ.రఘును ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన బాధ్యతలు చేపట్టారు.

ప్రభుత్వ కార్యాలయాల్లోకి పొగ

గార, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం గారలో వంశధార నది వైపు వెళ్లే రోడ్డు పక్కనే ఉన్న చెత్త కుప్పలకు, ప్లాస్టిక్ కవర్లకు నిప్పు పెట్టడంతో పొగ వెదజల్లుతోంది. దీంతో ఆ రోడ్డుకి ఇటువైపులా ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులు ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడ మండల వెలుగు హౌసింగ్ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రం, హైస్కూల్, హాస్టల్ కూడా ఉన్నాయి. చెత్తకుప్పల నుంచి వస్తున్న పొగ వల్ల ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. దీనికితోడు ఈ పొగ వల్ల వాతావరణం కలుషితం అవుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇక్కడ చెత్త కుప్పలు లేకుండా తొలగించి, పొగ మసమస్య లేకుండా చూడాలని సంబంధిత అధికారులను స్థానికులు వేడుకుంటున్నారు.



అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- డీఆర్వో వెంకటేశ్వరరావు
- గ్రీవెన్స్‌లో 217 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలోకి వెళ్లి అర్జీలను పరిశీలించి.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఆయన ఉప కలెక్టర్ పద్మావతితో కలిసి నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 217 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారానికి సంబంధిత అర్జీదారుని వద్దకు క్షేత్రస్థాయిలోకి వెళ్లి... వారితో మాట్లాడి, నాణ్యమైన సమాచారం అందజేయాలన్నారు. అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ అప్పారావు, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ రేషన్ డీలర్ మాకొద్దు

'ఈ రేషన్ డీలర్ మాకొద్దు.. దయచేసి మార్చాల'ని కోరుతూ లావేరు మండలం లక్ష్మీపురం, నేదురుపేట గ్రామస్థులు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'గత 30 ఏళ్లుగా ఒకే డీలర్ మా గ్రామంలో ఉన్నారు. సరుకులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు వేలిముద్రలు వేయించుకోవడం... సరుకులను దొడ్డిదారిలో అమ్ముకోవడం పరిపాటిగా మారింది. ఒకసారి 1200 కిలోల కందిపప్పు అక్రమంగా తరలిస్తుంటే గ్రామస్థులం పట్టుకుని, అధికారులకు ఫిర్యాదు చేశాం. తాత్కాలిక చర్యలు కూడా తీసుకున్నారు. ఈ రెండు గ్రామాల్లో 315 మంది కార్డుదారులు ఉన్నారు. అందులో సుమారు 300 మంది గత నాలుగు నెలలుగా రేషన్ తీసుకోవడం లేదు. మా సమస్యలు తీర్చాలని తహసీల్దారుకు విన్నవించుకున్నా న్యాయం జరగడం లేదు. రేషన్ అవకతవకలపై ప్రశ్నిస్తే గ్రామ స్థులపై తిరిగి తప్పుడు కేసులు పెడుతున్నారు. దయచేసి మాకు న్యాయం చేయండి' అంటూ రెండు గ్రామాల ప్రజలు అధికారులను వేడుకున్నారు.

టీసీలు ఇప్పించండి

మాకు టీసీలు, స్టడీ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఫీజులు చెల్లించినా, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు చూపించినా సరే మరో రూ.30వేలు కడితేనే టీసీలు ఇస్తామని స్థానిక ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల యాజమాన్యం వేధిస్తోందని 11 మంది ఇంటర్ విద్యార్థులు గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చారు. టీసీ లు ఇప్పించి, చదువుకు అంతరా యం లేకుండా చూడాలని వారు అధికారులను కోరారు.

అగ్రహారం భూ సమస్య పరిష్కరించాలి



మంత్రికి సమస్య వివరిస్తున్న విప్ అశోక్, కొర్లాం రైతులు

సోంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కొర్లాం అగ్రహారం పరిధిలోని 250 ఎకరాలు భూ సమస్య పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆ గ్రామ రైతులతో కలిసి విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. ఈ మేరకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని కలిసి ఆ గ్రామ రైతులు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల అగ్రహారం భూములు సాగుచేస్తున్న రై తుల పేరుతోకాకుండా వేరొకరి పేరుతో నమోదు అ య్యాయని, దీంతో రైతులకు 1బీలు రావడం లేదన్నారు. అందువల్ల ఈ సమస్య పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. మంత్రిని కలిసినవారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సూరడ చంద్రమోహన్, రత్నాల వెంకట రమణ, రాంబుడ్డి గణపతి, సోమేశ్వరరావు ఉన్నారు.

పాఠశాలను తరలించొద్దంటూ ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు, గ్రామస్థులు

పొందూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలో 3, 4, 5 తరగతులను వేరే పాఠశాలకు తరలించొద్దంటూ నందివాడ పంచాయతీ భగవాన్‌దాస్‌పేట పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానంతో భగవాన్‌దాస్‌పేట పాఠశాలలో 3, 4, 5 తరగతులను నరసాపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేశారు. తరగతులను తరలించొద్దంటూ గతంలో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవోకు వినతిపత్రం అందించారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో హెచ్‌ఎం రమేష్ పాఠశాలలో ఉండగా తమ పిల్లలతో తల్లిదండ్రులు నినాదాలు చేస్తూ పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోండి



సమావేశంలో పాల్గొన్న న్యాయాధికారులు

శ్రీకాకుళం లీగల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న నిర్వహించనున్న లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసుల పరిష్కారానికి ప్రయత్నం చేయాలని జిల్లా న్యాయాధికారి జూనైద్ అహ్మద్ మౌలానా అన్నారు. సోమవారం స్థానిక జిల్లా కోర్టు భవనంలో ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో 1వ అదనపు న్యాయాధికారి పి.భాస్కరరావు, 3వ అదనపు న్యాయాధికారి వివేకానంద శ్రీనివాస్, 4వ అదనపు న్యాయాధికారి ఎస్‌ఎం ఫణికుమార్, సీనియర్ సివిల్ న్యాయాధికారులు ఎం.శ్రీధర్, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు పెంచాలి: డీఈవో

ఇచ్ఛాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచేందుకు గ్రామస్థులు సహకరించాలని డీఈవో ఎస్.తిరుమల చైతన్య అన్నారు. సోమవారం ఆయన కొఠారి పాఠశాలను ఆయన సందర్శించారు. మోడల్ పాఠశాలలో రోల్ తక్కువగా ఉందని గుర్తించి పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని గ్రామస్థులకు తెలియజేశారు. అనంతరం డొంకూరు గ్రామాన్ని సందర్శించారు. ఇచ్ఛాపురం కేజీబీవీ పాఠశాలను సంద ర్శించిన డీఈఓ వెనుక బడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి భోజనం రుచికరంగా ఉందో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో-1, ఎంఈఓ-2 కె.అప్పారావు, ఎస్ విశ్వనాథం పాల్గొన్నారు.



బోధిస్తున్న డీఈవో

గుంతలో దిగబడిన ఇసుక లారీ



ఆమదాలవలస, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని ఒకటో వార్డు పరిధి పార్వతీశంపేట మలుపు వద్ద ఉన్న గుంతలో ఇసుక లారీ దిగుబడిపోవడంతో అటువైపుగా వెళ్లే వాహనాలు, ప్రయాణికులు అంతరాయం కలిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు ఛిద్రమై గుంతలు ఏర్పడడంతో అధిక లోడులతో వచ్చే వాహనాలు దిగబడిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. పరిమితికి మించి అధిక లోడ్లతో ఇసుక లారీలు వస్తూ తరచూ గుంతల్లో దిగబడిపోతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. లారీ దగిబడిపోవడంతో అలికాం, బత్తిలి రోడ్డు నుంచి పాలకొండ రోడ్డు వైపు వెళ్లే వాహనాలు పట్టణం గుండా వెళ్లాల్సి వస్తుందని వాహనచోదకులు అసహనం వ్యక్తం చేశారు. విజయవాడ వైపు వెళ్లాల్సిన వాహనాలు పట్టణం గుండా రావడంతో రద్దీ పెరిగి పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం వేకువ జాము దిగబడిన లారీ చీకటి వరకు తొలగించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలో కషర్‌బుగ్గి పాక్షి కంగా పనులు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారని, ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

ఎస్‌బీఐ వ్యవస్థాపక దినోత్సవం

ఇచ్ఛాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం వీకే పేట జంక్షన్ వద్ద గల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ 70వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. చీఫ్ మేనేజర్ సుకాంత్ కుమార్ సాహు కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు.

ప్రజాశక్తి సాహితీ సంస్థకు కుప్పిలి పాట ఎంపిక

ఆమదాలవలస, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజాశక్తి సాహితీ సంస్థ 2025 రచనల పోటీల్లో భాగంగా పాటల విభాగంలో నిర్వహించిన పోటీల్లో పట్టణానికి చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావు రాసిన మన పయనం ఎటువైపు అనే పాట ఎంపికైంది. ఈ పాటను ప్రజాశక్తి సాహితీ సంస్థ త్వరలో ప్రచురించబోయే కవి తా సంకలనంలో చేర్చనున్నట్టు సమాచారం అందిందని కవి రాజారావు తెలిపారు. పట్టణంలోని పలువురు సాహితీ ప్రియులు కవులు రాజారావు మాస్టార్‌కు అభినందనలు తెలిపారు.

పక్కాగా ఉపాధి పనులు చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు పంచాయతీల ద్వారానే పక్కాగా చేయాలని వైసీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు నేతింటి నీలమప్పడు అన్నారు. ఈమేరకు సోమవారం ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో డిప్యూటీ కలెక్టర్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు గౌరవ వేతనం పెంచాలన్నారు.

సమ్మె నోటీసు అందజేత

ఆమదాలవలస, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్టు అంగన్‌వాడీల సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ అమర్నాథ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం సమ్మెకు పిలుపునిచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు పంచాది లతాదేవి, పి.భూలక్ష్మి, సునీత, భారతి, ఉమాజ్యోతి, సత్యవతి, జానకి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పట్ల జాప్యం, నిర్లక్ష్యం ఉండరాదని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఆ ఫిర్యాదుల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ 63 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

ఓటర్ల జాబితాకు సహకరించండి

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నియోజకవర్గంలో ఓటర్ల జాబితా తయారీకి కావాల్సిన సలహాలు, సూచనలు అందజేసి సహకరించాలని ఆర్డీవో కె.సాయి ప్రత్యూష అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన కార్యాలయంలో సోమవారం నెలావారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివిధ పార్టీలు తెలియజేసిన ఓటరు జాబితాలో ఉన్న మరణించిన ఓటర్లు, వివాహం జరిగి గ్రామం నుంచి వలస వెళ్లిన ఓటర్ల తొలగింపు, డబుల్ ఓటర్ల నమోదు వంటి వాటిని తొలగించామన్నారు. అలాగే నమోదు చేయాల్సిన వారి వివరాలు ఉన్నా సరే అందజేయాలన్నారు. అన్ని పార్టీల వారు బూత్ లెవెల్ ఏజెంట్స్ జాబితాలను సమర్పించాలని కోరారు. సమావేశంలో శ్రీకాకుళం తహసీల్దార్ ఎస్.గణపతిరావు, డీటీ జీకే శ్రీనివాసరావు, టీడీపీ నుంచి మాదారపు వెంకటేష్, జనార్దన్, రౌతు శంకరరావు(వైసీపీ), ఆర్.పురుషోత్తం(బీజేపీ), బి.అర్జునకుమార్, భాస్కరరావు (జనసేన) తదితరులు పాల్గొన్నారు.

ఎందుకో.. ఆ మౌనం?

(ఐదో పేజీ తరువాయి)

సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరుతోంది. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లకు ఎక్కడికక్కడే వ్యాపారులను తాత్కాలికంగా నియమించుకుని.. వారి ద్వారా కొన్ని రకాల కూరగాయలనే మాత్రమే తెప్పించుకుని.. విద్యార్థులకు సమృద్ధిగా పెడుతున్నట్లు అధికా రులు లెక్కల్లో చూపిస్తున్నారు. వాస్తవ పరిస్థితి మరోలా ఉంది. ప్రస్తుతం కూరగాయలు ఏ విధంగా సరఫరా జరుగుతోంది. ఇతర నిత్యావసరాలు.. సరిగ్గా సరఫరా అవుతున్నాయా అన్నదీ పర్యవేక్షణ లేదు. టెండర్లు ఖరారు కాకపోయినా విద్యార్థులకు తాత్కాలికంగా ఇబ్బందులు లేకుండా ప్రిన్సిపాల్స్ నెట్టుకొస్తున్నారన్నది ఉన్నతాధికారుల అభిప్రాయం. కానీ, ఇక్కడే పెద్దతిరకాసు జరుగుతోంది. ధరల నియంత్రణ లేదు. కాంట్రాక్టర్ ఇచ్చిన ధరలనే తప్పనిసరిగా ఆమోదిస్తున్నారు. దీనివల్ల కాంట్రాక్టర్లు, అధికారులు పరస్పర లాభపడినవారూ ఉన్నారు. సుమారు 100 మంది టెండర్లు వేశారు. వీళ్లందరూ టెండర్లు ఏరోజున ఖరారు చేస్తారా? అని ఎదురుచూస్తున్నారు.

2,500 ఎకరాలకు సాగునీరందేనా?

(ఐదో పేజీ తరువాయి)

కాలువలు అవసరమని గుర్తించారు. వీటికి సంబంధించి సుమారు రూ.8కోట్లతో ప్రతిపాదనలను పోర్టు యంత్రాంగం ముందుంచారు. దీనిపై పోర్టు యంత్రాంగం అభ్యంతరం వ్యక్తం చేయడంతో స్థానిక వంశధార ఈఈ.. సాగునీటి కాలువల కల్వర్టుల నిర్మాణ అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాగా పోర్టు యంత్రాంగమే ఈ పనులు జరిపిస్తే రైతులకు సమస్యలు ఉండవని అధికారులు భావించినట్లు తెలుస్తోంది. రోడ్ల నిర్మాణంలో భాగంగా పోర్టు అధికారులు అక్కడక్కడా పైపులైన్లు పెట్టాలనే ఆలోచనలో ఉన్నారు. వంశధార అధికారులు మాత్రం బాక్సు కల్వర్టులు నిర్మించాలని కోరుతున్నారు. విష్ణుచక్రం, కస్పానౌపడా, కూర్మన్నపాలెం ఆర్అండ్ఆర్ కాలనీ, నౌపడా ఆర్ఎస్, ఇజ్జువరం, తలగాం, బిర్లంగిపేట, వేములవాడ, బన్నువాడ, మోదుగువలస, అయోధ్యపురం, పితాపురం, టెక్కలి ప్రాంతాల్లో బాక్సు కల్వర్టులు అవసరమని తెలిపారు. దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న వేళ జూలై 2న వంశధార ప్రధాన ఎడమకాలువ వెంబడి సాగునీరు విడిచిపెట్టనున్నారు. కాగా ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులతో కప్పబడిన కాలువల ద్వారా చెరువులు ఎలా నిండుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు.

నేడు మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన..

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం మధ్యాహ్నం టెక్కలిలో పర్యటించనున్నారు. పోర్టు రహదారుల నిర్మాణంలో భాగంగా పక్కనున్న భూములకు సాగునీటి సమస్యను గుర్తించేందుకు రైతులతో కలిసి పరిశీలించనున్నారని టీడీపీ నాయకులు తెలిపారు.

మరింత లోతుగా దర్యాప్తు

(ఐదో పేజీ తరువాయి)

పొందారు. కొన్నాళ్ల తర్వాత ఈ వ్యవహారం బయటపడడంతో అప్పటి కలెక్టర్ దర్యాప్తునకు ఆదేశించారు. ఈ మేరకు డీసీహెచ్ రాజ్యలక్ష్మి విచారణ చేపట్టి.. అనర్హులకు దివ్యాంగులుగా ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్టు వాస్తవమేనని గుర్తించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఏడు నెలల కిందట వైద్యవిధాన పరిషత్ అధికారులు సంబంధిత వైద్యులు, సూపరెంటెండెంట్‌కు సంజాయిషీ నోటీసులు జారీ చేసి శాఖాపరంగా దర్యాప్తు చేపట్టింది. ఈ వ్యవహారంలో వైద్యులు, సిబ్బంది పాత్రపై తాజాగా పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోనున్నారు.

మ్యాపింగ్‌తో తారుమారు

(ఐదో పేజీ తరువాయి)

ఈ పథకం కింద నిధులు జమకాలేదు. సచివాలయానికి వెళ్లి అడగ్గా.. కుటుంబంలో ఇన్‌కంట్యాక్స్ కడుతున్నవారు ఉన్నారని, అందుకే పథకం వర్తించలేదని సిబ్బంది తెలిపారు. వీరి కుటుంబంలో ఇన్‌కంట్యాక్స్ చెల్లించే ఓ సర్పంచ్ పేరు హౌస్‌హోల్డ్‌లో మ్యాపింగ్ అయినట్టు గుర్తించారు. దీంతో లక్ష్మీ, వెంకటరమణ దంపతులు ఆందోళన చెందుతున్నారు. మ్యాపింగ్ తారుమారుపై సచివాలయం చుట్టూ తిరిగినా.. ఫలితం లేకపోతోందని వాపోతున్నారు. అలాగే ఇటీవల బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నా.. తమకు ఇదే కారణంతో సబ్సిడీ రాదని అధికారులు తెలిపారని వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వకర్మ శిక్షణ ఇచ్చి.. ఉపాధి కల్పించే పథకానికి కూడా తమను అనర్హులుగా గుర్తించారని వాపోయారు. దీనిపై తహసీల్దార్, ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. సోమవారం శ్రీకాకుళంలో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో కూడా తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.


టెక్కలి: వరాహావతారంలో..


ఎల్.ఎన్.పేట:నరసింహావతారంలో..


జలుమూరు (సారవకోట): అవలింగిలో నరసింహావతారంలో..


శ్రీకాకుళం కల్చరల్: మొండేటివారి వీధిలో జగన్మోహిని అవతారంలో...


సోంపేట: వరాహస్వామిగా..

జగన్నాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు

జగన్నాథ స్వామి ఉత్సవాలను జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామి వారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. సోమవారం వరాహ, నరసింహ, రామావతారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. -ఆంధ్రజ్యోతి బృందం


ఇచ్ఛాపురం: రామావతారంలో..


పాతపట్నం: వరాహావతారంలో..


కంచిలి: మఠం కంచిలిలో పూజలందుకుంటున్న జగన్నాథుడు

గ్రీవెన్స్ 'సెల్' కదా అని..

- 'మీకోసం'లో అధికారులు సెల్‌ఫోన్లతో బిజీ


గ్రీవెన్స్‌లో సెల్‌ఫోన్లతో బిజీబిజీగా అధికారులు

-శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి):

గ్రీవెన్స్ 'సెల్' కదా... 'సెల్'తో కాలక్షేపం చేయొచ్చు లే అనుకున్నారేమో మన అధికార యంత్రాంగం. పైగా కలెక్టర్ కూడా ఎదురుగా లేరు. ఇంకేం సెల్‌ఫోన్ ముచ్చట్లలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళితే... వారం వారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు సోమ వారం వేరే కార్యక్రమానికి హాజరు కావడంతో డీఆర్వో వెంకటేశ్వరరావు ఆ బాధ్యతలు చూశారు. కలెక్టర్ లేకపోవడంతో అధికారులు గ్రీవెన్స్‌లో సెల్‌ఫోన్లతో బిజీబిజీగా కనిపించారు. అధిక శాతం అధికారులు తమ ఫోన్లు చూసుకుంటూ.. మాట్లాడుకుంటూ.. కాలక్షేపం చేశారు. 'కలెక్టర్ గారు లేకపోతే గ్రీవెన్స్ ఇలాగే ఉంటుంద'ని అర్జీదారులు వాపోవడం కొసమెరుపు.













చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.

పూజతో ప్రారంభం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి

- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.